నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 23 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## మిషన్ భగీరథ నీటిని అందించాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**



మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఆరాతీస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 22 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. శనివారం ఆసిఫాబాద్ మండలం తూంపెల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరాను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. ప్రతి ఇంటికీ నీటిని ఏ సమయంలో, ఎంత సేపు సరఫరా చేస్తున్నారనే వివరాలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా తాగు నీటి ఎద్దడి నివారించాలని ఆదేశించారు. పైప్‌లైన్లు లీకేజీలుంటే మరమ్మతు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. గ్రామంలోని ఓహెచ్‌ఆర్. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీపీవో భిక్షపతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా చదవాలి

**వరంగల్ ఆర్‌జేడీ కే సత్యనారాయణరెడ్డి**



కలమడుగు పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి

జన్నారం, మార్చి 22 : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని వరంగల్ ఆర్‌జేడీ కే నారాయణరెడ్డి సూచించారు. శనివారం జన్నారం మండలంలోని కలమడుగు పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు బోధనా విధానాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఇప్పటి నుంచే క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదవడంతో పదవ తరగతిలో మంచి మార్కులు సాధించగలుగుతారని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, డీసీఈబీ సహ కార్యదర్శి కుమార్, మురిమడుగు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం అనుముల రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అల్టిమేటం

**డబ్బులిస్తారా? ఇవ్వరా?.**

**"నేను చెప్పిందే వేదం.**

*నన్ను కాదని ఎవరూ ఏం చేయలేరు. ముందు నుంచి అధికార పార్టీని పట్టుకుని ఉంది నేను. అందుకే చెప్తున్నా.. ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి నాకు పైసలు రావాల్సిందే." అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే ప్రభుత్వ శాఖ ఉన్నతాధికారులకు హుకూం జారీ చేసినట్లు సమాచారం. డిపార్ట్‌మెంట్‌ను బట్టి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు.. ఇలా డిపార్ట్‌మెంట్లవారీగా ఆయా శాఖల హెచ్‌వోడీలను పిలిపించుకుని ప్రత్యేక టార్గెట్‌లు ఇచ్చినట్లు తెలిసింది. మా జిల్లాలో పని చేయాలనుకుంటే నేను అడిగినన్నీ డబ్బులు ఇవ్వాల్సిందే. లేకపోతే మీరు పని చేయలేరంటూ అల్టిమేటం జారీ చేశారట. దీంతో ఆ జిల్లాలో పని చేసే ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఒత్తిడి తట్టుకోలేమని మమ్ములను ట్రాన్స్‌ఫర్ చేసినా పర్లేదు. ఇలా టార్గెట్లు పెట్టి డబ్బులు డిమాండ్ చేయడం ఏందంటూ ఆందోళన చెందుతున్నారు. సదరు ఎమ్మెల్యేను ఎలా డీల్ చేయాలో తెలియక.. కొందరు ఉన్నతాధికారులు లాంగ్ లివ్‌పెట్టి వెళ్లిపోయేందుకు సిద్ధం అవుతున్నారు. ఇలాంటి ఎమ్మెల్యేను గతంలో ఎక్కడా చూడలేదంటూ వాపోతున్నారు.*

*- మంచిర్యాల, మార్చి 22*
*(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

**ప్రతి డిపార్ట్‌మెంట్ రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు ఇవ్వాల్సిందే..**

- జిల్లా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు టార్గెట్‌లు నిర్ణయించిన నేత
- చెప్పినన్ని డబ్బులిస్తే ఉంటారు.. లేకపోతే ట్రాన్స్‌ఫర్ అవుతారు..
- హడలెత్తిపోతున్న ఆయా ప్రభుత్వ శాఖల హెచ్‌వోడీలు
- లాంగ్ లీవ్ పెట్టి వెళ్లేందుకు సిద్ధమవుతున్న పలువురు అధికారులు
- కుల సంఘాలు, వ్యాపార రంగాల నుంచి కూడా డబ్బులు డిమాండ్
- అధికార పార్టీ ఇమేజ్ డ్యామేజ్ అవుతున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆ ఎమ్మెల్యే రూటే సెపరేటు





### అయ్యా.. ఎస్ అంటేనే ఓకే..

జిల్లాలో ఆ ఎమ్మెల్యే ఏం చెప్తే అదే జరగాలి. ప్రభుత్వ నిబంధనలు ఆయనకు అసలే వర్తించవు. జిల్లా ఉన్నతాధికారులు ఆయన ఏం చెప్తే దానికి అయ్యా.. ఎస్ అనాల్సిందే. రూల్స్‌కు వ్యతిరేకంగా చేసినా చూసీచూడనట్లు ఊరుకోవాలి. లేకపోతే సార్‌కు కోపం వస్తది. అనుమతులు లేకుండానే ఏ పనైనా చేసేస్తారు. ఇష్టం లేనిది కూల్చేస్తారు. ఇష్టం వచ్చింది కట్టేస్తారు. సార్ అనుచరులైతే గవర్నమెంట్ భూములను కబ్జా చేసిన ఓకే. సార్‌కు పడనోళ్లు పర్మిషన్ లేకుండా ఒక్క ఫ్లోర్ కట్టినా అది నేలమట్టం కావాల్సిందే. సార్ చెప్పినదానికి అధికారులు ఒకే చెప్పడం తప్ప ఇప్పటివరకు జిల్లాలో నియమనిబంధనల మేరకు జరిగిన ఒక్క పని కూడా లేదు. సార్ ఏం చెప్తే అది చేస్తున్నప్పటికీ శాఖలవారీగా ఈ డబ్బులు ఇవ్వడం ఏంటన్నది ఇప్పుడు జిల్లా అధికారులకు అర్థం కావడం లేదు. ఏ పనైనా చేస్తాం తప్ప పైసలకు ఏక్కడికి పోయేది. కింద పని చేసే అధికారులను డబ్బులు అడిగితే మా పరువు ఏం కావాలి. జిల్లా హెచ్‌వోడీ సీట్‌లో కూర్చోవడమే మేము చేసిన తప్పా. ఇంతకన్నా దౌర్భాగ్యం ఏం ఉంటుందంటూ ఆయా శాఖల ఉన్నతాధికారులు బాధపడుతున్నారు. ఎమ్మెల్యే పెట్టిన పైసల టార్గెట్ విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమైపోతున్నారు.

### కుల సంఘాలు, వ్యాపార వర్గాల నుంచి డిమాండ్

ప్రభుత్వ శాఖల అధికారులతోపాటు కుల సంఘాలు, వ్యాపార వర్గాలను ఆ ఎమ్మెల్యే సార్ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒకటో, రెండో చెప్పుకోదగ్గ పనులు ఏమైనా చేసిందంటే అది సారు నియోజకవర్గంలోనే. మిగిలిన నియోజకవర్గాల్లో ప్రత్యేకమైన పనులు, నిధులు ఏం లేవు. ఇటీవల ఎన్నికల కోడ్ ఉండగానే అట్టహాసంగా అన్ అఫీషియల్ ప్రారంభోత్సవం చేసిన ఓ ప్రాజెక్ట్ విషయంలో ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. గతంలో ఎవ్వరూ చేయలేనిది తాను చేశానంటూ ప్రచారం చేసుకుంటున్న సదరు నేత.. ఆ ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ కోసం కుల సంఘాలు, వ్యాపార సంఘాలను డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. నేను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేసిన పని ప్రతి నెల రూ.5 లక్షలు అవసరం అవుతాయి. అందుకని మీ కుల సంఘం తరపున రూ.లక్ష ఇవ్వండి అంటూ వ్యాపారాలు చేసే ప్రధానమైన రెండు కుల సంఘాల నాయకులకు హుకూం జారీ చేశారట. ప్రభుత్వం నుంచి రూ.లక్షన్నర వస్తది. మిగిలింది చూద్దాం అంటూ చెప్పారట. ఇది ఇప్పుడు సార్ నియోజకవర్గంతో పాటు జిల్లా కేంద్రం లోనూ



హాట్ టాపిక్‌గా మారింది. ఇక జిల్లాలో మొత్తం ఎన్ని వైన్స్ షాపులు ఉన్నాయో అన్ని షాపులు నెలకు రూ.25 వేల చొప్పున ఇవ్వాలని అడిగారట. దానికి షాపుల నిర్వాహకులు సంవత్సరానికి ఒకసారంటే ఇస్తామేమో గానీ, నెలనెల ఇవ్వలేం అంటూ సార్‌ను బతిమిలాడుకున్నారని తెలిసింది. గెలిచిన ఏడాదిన్నరలో వచ్చిన మంచి పేరు ఏమో గానీ, అధికారులను, కుల సంఘాలను డబ్బులు డిమాండ్ చేయడంతో సార్‌తోపాటు అధికార పార్టీ ఇమేజ్ కూడా డ్యామేజ్ అవుతున్నది. ఇన్ని రోజులు అధికారికంగా ఏం చేసినా మిన్నకుండిపోయిన జనాలు.. ఇప్పుడు సార్ దృష్టి తమపై పడడంతో బయటికి వచ్చి ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేసిన విషయంపై తెగ ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికైనా సార్ ఆలోచన మారుతుందా? లేకపోతే డబ్బులు ఇవ్వాలనే ఒత్తిడి పెరుగుతుందా? అన్నది తేలాల్సి ఉన్నది.

హాజీపూర్ : మక్క పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి



జన్నారం : మొర్రిగూడలో నేలవాలిన మక్క పంటను పరిశీలిస్తున్న అధికారులు



# గాలివాన బీభత్సం

- నేలకొరిగిన మక్క, వరి
- రాలిపోయిన మామిడి పిందెలు
- నష్ట పరిహారం అందించాలని అన్నదాతల వేడుకోలు

హాజీపూర్ : గుడిపేటలో నేల రాలిన మామిడి కాయలను చూపిస్తున్న రైతులు



హాజీపూర్/జన్నారం/దండేపల్లి మార్చి 22 : హాజీపూర్ మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయి. అన్నదాతలకు అపార నష్టం వాటిల్లింది. మక్క, వరి పంటలు నేలకొరిగాయి. మరో 20 రోజుల్లో మార్కెట్‌కు తరలించాల్సిన మామిడి కాయలు నేల రాలడంతో ఈ వర్షం తమ నోట్లో మట్టి కొట్టిందని రైతులు వాపోయారు. పొట్ట, పీచు, పిందె దశలలో ఉన్న వరి, మక్క, మామిడి పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి సాయం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు. మండలంలో దాదాపు 70 ఎకరాల వరి పంట, 70 ఎకరాల మక్క పంటలు దెబ్బతిన్నాయని, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని మండల వ్యవసాయ అధికారి కృష్ణ తెలిపారు. నర్సింగాపూర్‌లోని లగిశెట్టి రవి అనే వ్యక్తి ఇంటి పై రేకులు గాలికి ఎగిరిపడ్డాయి.

దండేపల్లి మండలంలో 7 గ్రామాల్లో సుమారు 86 ఎకరాల్లో మక్క పంట దెబ్బతిన్నదని, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని మండల వ్యవసాయాధికారి అంజిత్‌కుమార్ తెలిపారు. 10–15 రోజుల్లో చేతికి వచ్చే మక్క పంట నేలకొరగడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు సత్వరమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జన్నారం మండలంలోని మొర్రిగూడలో మక్క పంట తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఏవో సంగీత పరిశీలించారు. సింగరాయిపేట, తిమ్మాపూర్, రాంపూర్, కవ్వాల్, కిష్టాపూర్, కొత్తపేట, కలమడుగు గ్రామాల్లో పంట నష్టాన్ని అంచనా వేశారు. నివేదికను అధికారులకు పంపిస్తామని తెలిపారు.



హాజీపూర్ : వర్షానికి నేలకొరిగిన వరి చేను

### కూలిన గోడ..తప్పిన ప్రమాదం


కాసిపేట, మార్చి 22 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి ఎస్సీ కాలనీలో కోట రాజేశ్‌కు చెందిన ఇంటి గోడ శుక్రవారం రాత్రి వర్షానికి కుప్ప కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తహసీల్దార్ భోజన్న ఆదేశాల మేరకు ఆర్ఐ కమల ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా చేశారు.

### నిలిచిన విద్యుత్ సరఫరా

దహెగాం, మార్చి22: దహెగాం మండలం శుక్రవారం రాత్రి అంధకారంలో మగ్గింది. శుక్రవారం సాయంత్రం ఏర్పడి గాలివాన బీభత్సానికి ఈస్‌గాం 33 కేవీ విద్యుత్ లైన్‌పై చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రంతా చీకట్లోనే ప్రజలు ఇబ్బంది పడ్డారు. నీటి సమస్యతోనూ సతమతమయ్యారు. అధికారులు మరమ్మతులు చేపట్టి శనివారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

# సిర్పూర్ కాంగ్రెస్‌లో కలకలం

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీస్
- శ్రీనివాస్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం
- ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



కుమ్రం భీం ఆసిఫాబాద్, (నమస్తే తెలంగాణ)/ ఆసిఫాబాద్ టౌన్, మార్చి 22: అధికార కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ ముదురుతున్న విబేధాలు తారాస్థాయికి చేరుతున్నాయి. సిర్పూర్ నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న రావి శ్రీనివాస్ తీరుతో పార్టీ ప్రతిష్ట దిగజారుతున్నదని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కపై, ఎమ్మెల్సీ దండె విఠల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ జీ. చిన్నారెడ్డికి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రావి శ్రీనివాస్‌కు చైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీలోగా సమాధానం ఇవ్వాలని లేకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొనడం జిల్లాలో కాంగ్రెస్ వర్గాల్లో కలకలం రేపుతున్నది.

### అధిపత్య పోరులో ముదురుతున్న విభేదాలు

సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ దండె విఠల్ వర్గం, రావి శ్రీనివాస్ వర్గాలుగా కార్యకర్తలు చీలిపోయారు. అధికారిక హోదాలో ఎమ్మెల్సీ దండె విఠల్ చెప్పిన పనులు మాత్రమే జరుగుతున్నాయి. అధికారిక వర్గాలు కూడా రావి శ్రీనివాస్‌ను గానీ, ఆయన వర్గానికి ఏమాత్రం ప్రాధాన్యమివ్వడం లేదని తెలుస్తున్నది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కూడా తన మాట పట్టించుకోవడం లేదని, కనీసం ఫోన్ చేస్తే కూడా మంత్రి సీతక్క స్పందించడం లేదని రావి శ్రీనివాస్ మీడియా ముందు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. కొన్నిరోజులుగా రావి శ్రీనివాస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడంతో పాటు మంత్రి సీతక్కపై, ఎమ్మెల్సీ దండె విఠల్‌పై ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల దండె విఠల్ నివాసం ముందు తన వర్గానికి చెందిన కార్యకర్తలతో ఆందోళన చేపట్టారు. పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న రావి శ్రీనివాస్‌పై జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ జీ. చిన్నారెడ్డి రావి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీచేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోనూ డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావుకు ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ మధ్య విభేదాలతో అధిపత్య పోరు కొనసాగుతున్నది.

### మంత్రికి రావి శ్రీనివాస్ క్షమాపణ చెప్పాలి

**-ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు..**

ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర మంత్రి సీతక్కను కించపరిచేలా మాట్లాడిన సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆదివాసీ సంఘం నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి సీతక్కపై చేసిన వ్యాఖ్యలపై రావి శ్రీనివాస్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే శ్రీనివాస్‌పై ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ గణపతి, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, జిల్లా నాయకులు శ్యామ్, చరణ్, వసంతరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సిర్పూర్ నియోజవర్గ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే వరకు అధిష్టానంపై ఒత్తిడి తీసుకువస్తామని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.